సమస్యల్లో 'వసతి గృహాలు'

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

పాన్‌గల్: పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. అరకొర సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాలు తెరిచి మూడు నెలలు కావస్తున్నా విద్యార్థులకు అందాల్సిన కాస్మొటిక్ చార్జీలు నేటికీ అందలేదు. వసతి గృహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పాన్‌గల్ ఎస్సీ వసతి గృహంలో 90 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో కోతుల బెడద, ప్రహరీ లేదు, కాస్మొటిక్ చార్జీలు, అధ్వాన రహదారి, భోజనశాల లేకపోవడం వంటి సమస్యలున్నాయి.

వీపనగండ్ల మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో 23 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వసతి గృహంలో బాత్‌రూంలకు తలుపులు లేవు. కాస్మొటిక్ చార్జీలు ఇప్పటికీ అందలేదు. ఆయా వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు అధికారులు పరిష్కరించి, ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.


పాన్‌గల్ వసతి గృహంలో భోజనశాల లేక వరండాలో భోజనం చేస్తున్న విద్యార్థులు


వీపనగండ్ల వసతి గృహంలో తలుపులు లేని బాత్‌రూంలు

కాస్మొటిక్ చార్జీలు మంజూరు చేయాలి..



కాస్మొటిక్ చార్జీలు త్వరగా మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలి. మా వసతి గృహంలో ప్రహరీలేదు. కోతుల బెడద ఉంది. భోజనశాల వంటి సమస్యలున్నాయి. కోతుల బెడదను నివారిస్తే ఇబ్బందులు తొలుగుతాయి.

– వినయ్, 10వ తరగతి, ఎస్సీ వసతి గృహం, పాన్‌గల్

బాత్‌రూమ్‌లకు తలుపులు బిగించాలి..



మా వసతి గృహంలో బాత్‌రూమ్‌లకు సరైన తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నాం. మా వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలి.

– ఉదయ్‌కుమార్, 7వ తరగతి, బీసీ వసతి గృహం, వీపనగండ్ల

జిల్లా అధికారులకు నివేదించాం..

వసతిగృహంలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారులకు నివేదించాం. వసతి గృహంలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. కాస్మొటిక్ చార్జీలు ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే విద్యార్థులకు అందజేస్తాం.

– ఆంజనేయులు, వార్డెన్, పాన్‌గల్

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

చిన్నంబావి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో దళారుల పాత్ర ఉండొద్దని, లబ్ధిదారులు నేరుగా అధికారులను కలిసి లబ్ధిపొందాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, ఎంపీడీఓ రవి నారాయణ, సింగిల్‌విండో చైర్మన్ బగ్గరి నర్సింహారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మద్దిలేటి, సర్పంచ్‌లు రామస్వామి, చక్రధర్‌గౌడ్, శివమ్మ, సత్యరాణి, పద్మమ్మ, ఎంపీటీసీలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మెనూ ప్రకారం భోజనం అందించాలి


బుసిరెడ్డిపల్లి పీఎస్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శేఖర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని చింతకుంట, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, రాయినిపల్లిలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలు, మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలన్నారు. మధ్యాహ్నభోజనాన్ని ప్రతి రోజూ పాఠశాల హెచ్‌ఎంలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

పాన్‌గల్: సీఎం సహాయనిధి పేదలకు ఎంతో మేలు చేస్తోందని మాందాపూర్ ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన ప్రవీణ్‌కు రూ.12 వేలు, కావలి సరోజకు రూ.22వేలు, తెలుగు పద్మకు రూ.18వేల చెక్కులను ఆయన అందించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్‌రెడ్డికి, మండల ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కల్యాణ్, బుచ్చన్న, బాలస్వామి, చిన్నమౌలాలి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి నుంచి జమ్మాపూర్ గ్రామ శివారు వరకు ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ.10లక్షలతో రోడ్డు నిర్మాణానికి గురువారం ఎంపీటీసీ సభ్యులు శ్యామల భూమి పూజ చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం హర్షించదగిన విషయమన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే, మంజూరుకు సహకరించిన మండల ప్రజాప్రతినిధులకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హన్మంతురెడ్డి, శ్రీనివాస్ నాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, రాంగోపాల్, భీరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, పవన్‌చారి, ఆనంద్, విక్రమ్‌చారి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ కుర్చీల పంపిణీ

వనపర్తిటౌన్: రాష్ట్రంలో, జిల్లాలో సంక్షేమ హాస్టళ్లను బలోపేతం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు, మంత్రి నిరంజన్‌రెడ్డికి దక్కుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బిజయ్య కాలనీలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో మంజూరైన 168 స్టడీ కుర్చీలను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతూనే సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

పాన్‌గల్: మండలంలోని టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం మండలంలోని మాందాపూర్ లో కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు పాల్గొని కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఒక్కసారి బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాలకృష్ణనాయుడు, ఆనంద్, స్వామి, సుధాకర్, రామస్వామి, సత్యానారాయణ, కృష్ణ, జగదీశ్‌గౌడు, రాకేష్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

వీపనగండ్ల: ప్రతి నెలా 30వ తేదీన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని తెలంగాణ దండోరా జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగ గురువారం తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు శాలువా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలని జిల్లా ఉద్యాన అధికారి, మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలు, స్టోర్‌రూమ్, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. క్రీడాసామగ్రి, తాగునీటిపై ఆరా తీశారు. ప్రహరీ, డైనింగ్‌హాల్, డ్రెయినేజీ సమస్యలను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వంటగది, స్నానపు గదులను పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు ఉన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్

బాధితునికి ఎల్‌ఓసీ అందజేత



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన చిన్నరాములు కొంత కాలంగా అనారోగ్యం వల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన రూ.1లక్ష ఎల్‌ఓసీని మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో లబ్ధిదారునికి అందజేశారు.

నిర్లక్ష్య నీడలో సంక్షేమ వసతి గృహాలు


మండల కేంద్రంలో మాట్లాడుతున్న కిరణ్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రకటనలు చేయడం తప్ప చేసిందేమీ లేదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే సమరభేరి జీపుయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జీపుయాత్ర నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశామని చెబుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కళాశాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. విద్యారంగ సమస్యలతో పాటు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది, సహాయ కార్యదర్శి రాఘవ, కుమార్, మల్లేష్, వంశీ, ఈశ్వర్, వినయ్, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వనపర్తి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని కడుకుంట్లకు చెందిన చిలుక సాయికృష్ణ(29) బుధవారం రాత్రి 8గంటలకు స్కూటీపై అత్తగారి ఊరు విలియంకొండకు బయలుదేరాడు. మెంటెపల్లి పల్లె పకృతి వనం వద్ద అడవిపంది అడ్డురావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. అదేదారిలో వస్తున్న మెంటెపల్లికి చెందిన ప్రకాష్ చూసి సాయికృష్ణ అన్నకు ఫోన్ చేశాడు. అతను వచ్చి తమ్మున్ని వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రాత్రి చనిపోయాడు. అతని భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల విచారణ

పెబ్బేరు రూరల్: వనపర్తి మడలంలోని గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తుల విచారణ చేపట్టామని ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. గురువారం ఆయన పెద్దగుడెంలో దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అమరచింత: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పారదర్శకంగా సేకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని అన్ని వార్డుల్లో దరఖాస్తుదారుల విచారణ చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సింధు, విజయరాములు, రాజశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


వెంగళాయిపల్లిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో గృహలక్ష్మి దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. వెంగళాయిపల్లిలో ఐకేపీ ఏపీఎం చైతన్య సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి వనపర్తికి వెళ్లే దారిలో పెట్రోల్‌బంకు వద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో రింగ్ బాల్ టీమ్ సభ్యులు గురువారం జేసీబీతో పూడ్చివేశారు. ఈ రహదారిపై గుంతల వల్ల ద్విచక్రవాహనాలు కింద పడి ప్రమాదాలు అవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రింగ్‌బాల్ టీమ్ సభ్యులు గొడుగు సత్యం, పాలవాది రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన

పెబ్బేరు రూరల్: సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం శ్రీరంగాపురం పాత గ్రామ పంచాయతీలో మండల డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌లో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాటు 312 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీగౌడు, ప్రజలు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో గురువారం ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు, అధికారులు ప్రత్యేకంగా ఈవీఎంలను ఏర్పాటు చేసి ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే విషయాలు వివరించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రానికి ఏఈ కబీర్‌దాస్, సర్పంచ్ సతీష్‌కుమార్‌లు భూమిపూజ చేశారు.

'డబుల్ బెడ్రూం'లపై అభ్యంతరాలు ఇవ్వాలి

పెబ్బేరు: పట్టణంలో పేదలకోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ఏమైనా అభ్యంతరాలుంటే దరఖాస్తు చేయాలని గురువారం తహసీల్దార్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 204 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో వాటి పంపిణీకి కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. 890 దరఖాస్తులు రాగా, పరిశీలించి అర్హులుగా 309 మందిని గుర్తించినట్లు తెలిపారు. అనర్హులుగా 581 దరఖాస్తులు గుర్తించామని, వాటిపై అభ్యంతరాలుంటే 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో రాత పూర్వకంగా దరఖాస్తు చేయాలని కోరారు. అర్హులు, అనర్హులు జాబితాను తహసీల్దార్ కార్యాలయం, పురపాలక సంఘం కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, అగ్రికల్చర్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డుపై పెట్టనున్నట్లు తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెం క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూంల సమస్యలు పరిష్కరించాలని గురువారం లబ్ధిదారులు కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్‌కు వినతి పత్రం సమర్పించారు. వీధిలైట్లు, తాగునీరు ఏర్పాటు చేయలేదని తెలిపారు. రాత్రి సమయంలో విష పురుగులు తిరుగుతున్నాయని, పిల్లలు, వృద్ధులు బయపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి పరిష్కారం చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం


మదనాపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మదనాపురం: ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని గురువారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మదనాపురం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అబ్రహం లింకన్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, జిల్లా ఐటీ సెల్ కో కన్వీనర్ కరికె నితిన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో అర్హులైన వారికి డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని గురువారం వనపర్తి తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

అమరచింత: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు క్యామ భాస్కర్, హరీష్, వెంకటేశ్వర్లు, నరాల నారాయణ, లింగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు


వార్డు కమిటీల నాయకులతో చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. కౌన్సిలర్లు జయసుధమధు, సుమిత్రయాదగిరిలు గురువారం జిల్లా కేంద్రంలో 10, 11వ వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందిస్తామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, మాజీ పట్టణ అధ్యక్షుడు డీ కిరణ్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్, బాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి బాబా, భాస్కర్, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డీ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం


జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

పెబ్బేరు రూరల్: యువతకి ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్‌ఐ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, యువతను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. యువతకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజశేఖర్, జిల్లా నాయకులు మహేష్, ఖాజా, కమలాకర్, భాస్కర్‌గౌడు, శ్రీకాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు సర్కార్ మోసం

పెబ్బేరు రూరల్: తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీ కృష్ణ, పలువురు నేతలు విమర్శించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో రెండో ఏఎన్‌ఎంల సమ్మెకు బీజేపీ, ఐద్వా, ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం మాటతప్పిందన్నారు. రెండో ఏఎన్‌ఎంలను నోటిఫికేషన్ లేకుండా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ నాయకులు శ్రీరాం, లక్ష్మి, ఏఎన్‌ఎంల సంఘం నాయకులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావాణ్య, లలిత పాల్గొన్నారు.


రెండో ఏఎన్‌ఎంల సమ్మెలో మాట్లాడుతున్న నాయకులు

క్లుప్తంగా

పట్టణంలో పారిశుద్ధ్యం పనులు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు విస్తృతంగా చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. ఆరు, ఏడో వార్డులతో పాటు ఎనిమిదో వార్డులో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలకు గ్రేడింగ్ ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను సైజుల ప్రకారం షిఫ్టింగ్ చేసి గ్రేడింగ్ ఇవ్వాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని రోడ్డుమీదితండాల్లో పర్యటించిన ఆయన గ్రామంలో గృహలక్ష్మి దరఖాస్తుల వివరాలు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులకు రాగిజావ

మదనాపురం: మండలంలోని దుప్పల్లి జెడ్పీ హెచ్‌ఎస్ లో పోషకాలతో కూడిన రాగిజావను గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆంజనేయులు మాట్లాడుతూ రాగిజావ ఎంతో రుచిగా తయారు చేసి వారానికి మూడుసార్లు మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు ఇస్తున్నామన్నారు. అనంతరం వంట ఏజెన్సీ మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన చీరలను పంపిణీ చేశారు.

పాన్‌గల్ తహసీల్దార్‌గా రాంబాయి



పాన్‌గల్: పాన్‌గల్ మండల నూతన తహసీల్దార్‌గా రాంబాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలంలో గత కొన్ని నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో డీటీ చక్రపాణి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఏఎన్‌ఎంకు ఘన సన్మానం



మదనాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం గ్రేస్ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నది. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆమెను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు సేవలు అందిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బోయేజ్, సుభాష్, బెనర్జీ, సంతోష్, రాజు, ప్రసాద్, జపనీయ తదితరులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ..

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అందజేస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ రాయితీ పొందాలి

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న విద్యుత్ వినియోగ రాయితీని వినియోగించుకోవాలని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల విద్యుత్ ఏఈలు అప్పలనాయుడు, భగవంతు కోరారు. దీనికోసం ఎస్సీ, ఎస్టీలు కులధ్రువీకరణ పత్రాలు తమకు అందజేయాలని ఆయన కోరారు.

శ్రావణమాసం ప్రత్యేక పూజలు

ఆత్మకూర్: పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ప్రముఖ సాయిక్షేత్రమైన శ్రీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ రిజియన్ చైర్మన్ రాముని నీలేష్, భాగ్యలక్ష్మి రైస్‌మిల్ అధినేత సింగందయ్‌లు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పే స్కేల్ అమలు చేయాలి

గోపాల్‌పేట: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని వనపర్తి జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా జేఏసీ పిలుపు మేరకు గురువారం ఎంఈఓ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టినట్లు తెలిపారు.

ఖిల్లాఘనపురం: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా గురువారం మండల కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తిర్పతయ్య, పవన్, అర్జున్, సీఆర్‌పీలు వెంకటేష్, పార్వతమ్మ పాల్గొన్నారు.